
# చలెగ చలెగ యె ఇష్క్ కా జమానా...



ధూమ్ మచారే... ధూమ్ మచారే... యూట్ వెల్‌ల్లో దుమ్ము రేపుతోంది పాట.

వొక్కొక్క టేబుల్ దగ్గర గుంపులుగుంపులుగా కూర్చొని గట్టిగట్టిగా మాట్లాడుకుంటూ నవ్వుకుంటూ అమ్మాయిలు, అబ్బాయిలు.

వాళ్ళ ముందు ఖాళీ అవుతున్న కోక్ గ్లాసులు, పిజ్జా, బర్గర్, పఫ్, పేస్ట్రీస్‌తో సగం నిండుగా వున్న పేపర్ ప్లేట్స్. వుండలుండలుగా చేతులు తుడుచుకొన్న పేపర్ నాప్ కిన్స్.

దాదాపుగా అందరూ యెదుటివాళ్ళతోటీ, సెల్‌ఫోన్‌లోనూ వొకేసారి మాట్లాడేసు కుంటున్నారు.

అటో ఛైర్, యిటో ఛైర్ వున్న టేబుల్ దగ్గర కూర్చుని మిళింద్ తన సెల్‌ఫోన్ వైపు గేట్ వైపు మార్చిమార్చి చూస్తూ, 'మరోసారి ఫోన్ చేస్తే,' అనుకున్నాడు. యింతలో ఫోన్ మోగింది. ఆత్రంగా చూశాడు.

యెదురు చూస్తున్న కాల్ కాదు. శ్రీకర్. ఫోన్ లిఫ్ట్ చేయగానే, "హాయ్ డూడ్..." హుషారుగా అన్నాడు శ్రీకర్.

"హాయ్.'

"యెక్కడున్నావ్ మామా..."

"యీట్‌వెల్."

"వచ్చేస్తున్నానయితే."

"యిప్పుడొద్దు... మాళవిక కోసం చూస్తున్నా."

"మళ్ళీ ఫైటింగా. యీసారేంటి యిష్యూ... గార్బేజా..."

"అలాంటిదే... మాన్‌హోల్," అన్నాడు మిళింద్.

"వావ్... సెక్సియెస్ట్ టర్మ్," గట్టిగా నవ్వుతూ అన్నాడు శ్రీకర్.

మిళింద్ కూడా గట్టిగా నవ్వేస్తూ, "యిలా అన్నాననే వచ్చింది మాళవికకి కోపం. యిక్కడికి రమ్మని నిన్నటి నుంచి నాలుగు మెసేజ్‌లు పంపించా... ఫోన్ లిఫ్ట్ చేయదు. మెసేజ్‌లకు రిప్లయ్ యివ్వదు. రాలేదు యేం చేయాలో అర్థం కావట్లా... యింటికెళదామంటే వాళ్ళ డాడీ డర్టీ లుక్స్ యిస్తాడు నా వైపు. బాపురే... లాస్ట్ టైమ్ యిలా అన్నందుకే వారంరోజులు మాళవిక మాట్లాడలేదు. యెవ్వరికీ లేని యీ గొడవలేంట్రా యెప్పుడూ నాకు. నువ్వు లక్కీరా. దేవికతో నీకిలాంటి గొడవలేం లేవ్ కదరా."

"యిలాంటివి లేవ్ కానీ... లేటెస్ట్ డైమండ్ కొనలేదనో, వీకెండ్‌కి కొత్త పబ్‌కి తీసుకెళ్ళలేదనో, అమెరికా వెళ్ళటానికి సీరియస్ యెఫర్ట్ పెట్టడం లేదనో యిలాంటి గొడవలు చాలుంటాయ్... అయినా దేవిక, మాళవిక అంత అంద మైనది కాదు కదరా... అసలు మాళవిక యేంట్రా యెంతసేపు చూసినా తనివి తీరదు... అలా చూడాలనిపిస్తూనే వుంటుంది," అని శ్రీకర్ గట్టిగా నవ్వుతూ, "బ్యూటీఫుల్ మాళవిక కోసం కొంచెం సమాజసేవ చెయ్యరాదా... నీకు వోపిక లేకపోతే చెప్పు నే మాట్లాడుకుంటా..." కొంటెగా అన్నాడు.

"షటప్... దేవికకి చెప్తానుండు. యేంట్రా నేను లేనప్పుడు నాక్కాబోయే ఆవిడతో ఫ్లర్ట్ చేస్తావా... చంపేస్తారా..." నవ్వుతూ అన్నాడు మిళింద్.

"యేడిచావ్‌గాని యింతకీ యిష్యూ యేంట్రా..."

"వో గాడ్... అదో పెద్ద కథ. మాళవికని యెలా యింప్రెస్ చేయాలో అర్థం కావట్లేదు. నువ్విక్కడికి రారా... డిస్కస్ చేద్దాం," అన్నాడు మిళింద్.

"యెంతసేపట్లో రావాలిరా."

"యెక్కడన్నావ్," అని అడుగుతూ తలెత్తి చూస్తే తన యెదుటి కుర్చీలో శ్రీకర్.

"అరే యిక్కడే వున్నావా..."

"డ్రైవ్ చేస్తూ నీతో మాట్లాడుతూ యిక్కడి కొచ్చేశాన్రా," అన్నాడు శ్రీకర్.

"డ్రైవ్ చేస్తూ ఫోన్ మాట్లాడినా మాళవికకి తప్పే,' అన్నాడు మిళింద్.

హాట్ పిజ్జా, వొక కోక్ తెచ్చుకొని శ్రీకర్ కూర్చుంటూ, "చెప్పరా యేంటి యీసారి గొడవ," అని అడిగాడు.

"పోయినసారి వాళ్ళ యింటి ముందు చాలా చెట్లున్నాయని, అక్కడ అందరూ తుక్కు పడేస్తారని, ఆ తుక్కు క్లియర్ చేయక రోజూ పందికొక్కు లొస్తున్నాయి. వాటికోసం పాములొస్తున్నాయి. పాము కాటేసి ఆ పక్కన పాకల్లో వొకతను పోయాడని, ఆ తుక్కుని యెప్పటికప్పుడు క్లియర్ చేయమని మున్సిపల్ ఆఫీస్ చుట్టూ తిరిగిందా... తర్వాత ఆ పాకలో వాళ్ళందర్నీ స్నేక్ ఫ్రెండ్లీ గ్రూప్‌తో మీటింగ్ పెట్టింది. 'నీకెందుకిదంతా,' అన్నానని కోపం వచ్చేసిందప్పుడు."

"యింతకీ వాళ్ళా చెత్తని క్లియర్ చేసారా..." అడిగాడు శ్రీకర్.

"అదో పెద్ద కథ... వాళ్ళప్పుడు ఆ చెత్తని, అడవిలా పేరుకుపోయిన తుమ్మని క్లియర్ చేయలా. తుమ్మ చెట్లన్నీ ప్రైవేట్ ప్రాపర్టీలో వున్నాయి. యీ మధ్య డెంగ్యూ ఆపరేషన్‌లో భాగంగా ఆ చెట్లని, చెత్తని బుల్‌డోజర్స్ ప్రొక్లేన్‌తో క్లియర్ చేసేసారు," అన్నాడు మిళింద్.

"సో, దీన్తో తెలిసిందేంటంటే పాముల కంటే దోమలు పవర్‌ఫుల్ అన్నమాట," అని పడీపడీ నవ్వుతూ, "వో.కె. యిప్పుడు కొత్త గొడవేంటి," అడిగాడు శ్రీకర్.

"కొత్త గొడవేంటంటే... మ్యాన్‌హోల్," అన్నాడు మిళింద్.

నవ్వుని ఆపుకుంటూ, "యేమైందంట," అన్నాడు శ్రీకర్.

"వాళ్ళ కాలనీలో వో వీధిలో మూతలేని మాన్‌హోల్స్ మూడున్నాయంట... వాటితో తన యెక్స్‌పీరియన్స్ అంతా చెప్తా విను," అన్నాడు మిళింద్.

మాళవిక ఆరోజు మార్నింగ్ వాక్ కోసం లేతరంగు ట్రాక్‌సూట్‌లో తెలతెలవారుతుండగానే యింట్లోంచి బయటికొచ్చింది. కాలనీ వీధుల్లో పాలప్యాకెట్లు, న్యూస్ పేపర్స్ యిచ్చే అబ్బాయిలు, మార్నింగ్ వాక్‌కి వస్తున్నవాళ్ళు, అక్కడక్కడా బద్ధకంగా పడుకొని వున్న వీధి కుక్కలు తప్ప మరెవరూ లేరు. కొంచెం విచ్చుకొంటున్న ఆకాశపు వెలుగుని, చిన్నగా కదులుతున్న తురాయి కొమ్మల పచ్చదనాన్ని నింపుకొంటున్న ఆమె చూపు వున్నట్టుండి ఆ వీధిలో గుండ్రంగా తెరచి వున్న మూడు మ్యాన్‌హోల్స్ మీద నిలిచింది.

'బాగు చేయటానికని తీసిన మూతలు తిరిగి పెట్టలేదా... అసలు వీటిమీద మూతలే లేవా... యిలా వుంటే ప్రమాదకరం కదా...' అనుకుంటూ ఆ యెదుటి అపార్ట్‌మెంట్ దగ్గరున్న వాచ్‌మెన్‌ని, "వీటి మీద మూతలేమైనాయ్..." అనడిగింది.

కూర్చున్న చోటు నుంచి కదలకుండా తల అడ్డంగా వూపాడు ఆ వాచ్‌మెన్. ఆ పక్కనున్న మరో అపార్ట్‌మెంట్ ముందున్న వాకిలిని చిమ్ముతున్నావిడని చూస్తూ, "వీటి మూతలేమైనాయ్..." అడిగింది మాళవిక.

"యేమోనమ్మా వాళ్ళొచ్చి అందులో పూడుకుపోయిన చెత్తని బైట వేశారు... అంతే... పోయారు..."

"అరె యిలా వుంటే ప్రమాదం కదా," అంది మాళవిక.

"యెవరో వొకరు పడితేగాని పటాలం కదలిరాదు," కోపంగా అంటూ ఆ కోపాన్ని వూడుస్తున్న చీపురు మీద చూపించిందామె.

మాళవిక వో క్షణం ఆలోచించి, "యేమైనా అడ్డు పెడదామా," అంది.

ఆ వూడుస్తున్నామె ఆగి మాళవికవైపు తేరిపార చూస్తూ,

"వాటి మీద మనమేం పెడతామమ్మా," అయోమయంగా అడిగింది. యింతలో యీ అపార్ట్‌మెంట్‌కి యెదురుగా వున్న అపార్ట్‌మెంట్ గేటు తెరుచుకొని చకచకా బైటికొచ్చిన నీలపూల చీరామె ఆగి, "యేందమ్మా," అంది వీళ్ళని చూస్తూ.

"నువ్వేమో పనిలోకెళ్ళిపోతావ్. మీ ఆయనేమో మెట్లు తుడిచే పనిలో వుంటాడు... మీ పిల్లలది తెలిసీ తెలియని వయసు. మీ ఆయనెళ్ళి కంపైనా తెచ్చేస్కోడు దానిమీద," అంది వూడ్చే ఆమె.

"పనిలోకెళ్ళినా యీ పిల్లల గురించే భయమైపోతుంది. యీ మూతలు పెట్టకుండా పోతారేంటో," నిట్టూర్చి, "టైమౌతుంది," అని చకచకా వెళ్ళిపోయింది నీలిపూల చీరామె.

మాళవిక అక్కడే నిలబడి, "యెవర్నైనా పిలవండి. కంపైనా వేయిద్దాం... నీ పేరేంటి," అడిగింది వూడుస్తున్నామెని.

"కుమారమ్మా," అంటూ యేదో వొకటి చేసేవరకు యీ మాళవిక కదలదని అర్థమై వాళ్ళాయన్ని, ఆ అపార్ట్‌మెంట్, యీ అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌లను పిల్చుకొచ్చింది. అందరూ కలిసి వాటిల్లోకి కొట్టుకొచ్చిన తుమ్మ కంపల్ని దూర్చారు.

"నేనివాళే మునిసిపల్ ఆఫీసులో కంప్లెయింట్ యిస్తాను. అప్పటివరకూ యీ కంపలుండేట్టు చూసుకోండి. లేకపోతే ప్రమాదం," అంది మాళవిక.

అక్కడనుంచి యింటికొస్తూ, 'యీ కాలనీలో వొకటో అరో ముళ్ళకంపలుండబట్టి వేసాం కానీ లేకపోతే ఆ మూడింటి మీద యేమైనా పెట్టడం యెంత కష్టం,' అనుకొంది మాళవిక. యింటికొచ్చి రెడీ అయ్యి ట్రాఫిక్‌జామ్‌ని దాటుకొంటూ కాలేజీ కొచ్చింది. మేడమ్ గుర్రుగుర్రుగా చూస్తూ, "యెందుకు లేటుగొచ్చావ్," అంది.

గబగబా రెండు వాక్యాల్లో మ్యాన్‌హోల్ సంగతి చెప్పింది మాళవిక.

"అది వాళ్ళు డీల్ చేస్కుంటారు కదా... కాలేజీకి లేటొస్తే... యిట్స్ నాట్ గుడ్," విసుక్కుందామె.

సోషల్ రెస్పాన్స్‌బిలిటీ మీద స్పెషల్ ప్రోగ్రాం చేస్తున్న టి.వి. వాళ్ళతో గుక్క తిప్పుకోకుండా మాట్లాడిన ఆమె రూపం మాళవిక కళ్ళ ముందు మెరుపులా మెరిసింది. ఆమెకేమీ సమాధానం చెప్పకుండా క్లాస్‌రూమ్‌లోకి వెళ్ళింది మాళవిక.

మున్సిపల్ ఆఫీసులో యివ్వటానికి అప్లికేషన్ రాసింది. కానీ అక్కడికెళ్ళి యిచ్చి వచ్చే టైమ్ దొరకలేదు మాళవికకి. పర్మిషన్ అడిగితే కరిచేలా వుంది మేడమ్. అప్పటికీ మున్సిపల్ ఆఫీస్ నెంబర్ తీసుకొని ఫోన్ చేసింది. జవాబు లేదు... లేదా... యెంగేజి... చివరికి యెవరో లిఫ్ట్ చేసి, 'యిప్పుడెవరూ లేరు,' అని ఫోన్ పెట్టేశారు.

సాయంత్రం యింటికొచ్చి డిన్నర్ చేస్తున్నప్పుడు, "రేపు కూడా కాలేజీ నుంచి బయటపడే అవకాశం లేదు... యీ అప్లికేషన్ కాస్త మున్సిపలాఫీసులో యిస్తావా," అని తల్లిని అడిగింది మాళవిక.

కళ్యాణిగారు సరే అన్నారు.

మర్నాడు కాలేజీ నుంచి వచ్చిన మాళవికకి 'అప్లికేషన్ యిచ్చాన'ని చెప్పారు కళ్యాణిగారు.

ఆ మర్నాడు వాకింగ్‌కి వెళ్ళినప్పుడు, "అప్లికేషన్ యిచ్చాము. వాళ్ళొస్తారు... వేసేస్తారు..." అని కుమారితో చెప్పింది మాళవిక.

'పిచ్చిపిల్లో... అమాయకురాలో,' అన్నట్టు మాళవికని చూసింది కుమారి.

రెండ్రోజులు గడిచిపోయినా వాళ్ళెవరూ రాలా. ఆరోజు వర్షం పడుతోంది. ప్రాజెక్ట్ ప్రజెంటేషన్ యిస్తున్న మాళవిక మనసంతా మ్యాన్‌హోల్ మీదే వుంది. 'వర్షానికి నీళ్ళేమైనా నిలిచిపోయాయా... కంపలు కొట్టుకుపోయాయా... అక్కడ అసలు మ్యాన్‌హోల్స్ వున్నట్టు వెళ్ళేవాళ్ళకి తెలుస్తుందా... నీలిపూల చీరావిడ పిల్లలు యింట్లోనే వున్నారా... నీళ్లు చూస్తే పిల్లలకి సరదా. పొరపాటున బైటికి రాలేదు కదా...'

ఆమె మనసంతా అనీజీ... యెలాగోలా ప్రెజంటేషన్ కానిచ్చి బైటికొచ్చి తల్లికి ఫోన్ చేసింది.

"కాస్త వీలైతే ఆ వీధికొకసారి వెళ్ళొస్తావా," అడిగింది.

"వూ..." అన్నారు కళ్యాణిగారు.

అమ్మ చేతిలోంచి ఫోన్ తీస్కొని, "మరీ అంత భయపడకు. యిలాంటివి యీ సిటీలో చాలా వున్నాయ్. యెన్నని మనం పర్సనల్‌గా చూడగలం... నీకు పనేం లేనట్టుందసలు," నవ్వుతూ అంటున్న తమ్ముడి మాటలకి, "తెలిసిందైనా పట్టించుకోకపోతే యెట్లా... బై," అని ఫోన్ పెట్టేసింది మాళవిక.

విష్ణు ఫోన్ టేబిల్‌పై పెడుతూ, "హెల్మెట్ పెట్టుకో... తాగి డ్రైవ్ చేయొద్దు... వొకే బండిపై ముగ్గురు యెక్కొద్దు. ఆ థియేటర్‌లో, ఆ మాల్‌లో ఫైర్ సేఫ్టీ మెజర్స్ లేవ్ వెళ్ళొద్దని వొట్టు వేయించుకోవటం. యిలా నా బుర్ర తినేస్తున్నారు. చాలదన్నట్టు యిప్పుడా డిపార్ట్‌మెంట్స్ చుట్టూ తిరుగుతున్నారు. వాళ్ళు మాత్రం యెంతని చేస్తారు... వాళ్ళకెన్ని పనులుంటాయో. భలే పిరికివాళ్ళు. మీరిద్దరూ భలే బోర్..." వెక్కిరింతగా అన్నాడు తల్లితో విష్ణు.

"మీకు దూకుడెక్కువ. యీ సిటీయేమో రోజురోజుకీ ప్రమాదభరితంగా తయారవుతోంది. హెల్మెట్ పెట్టుకోమంటే కోపమేంట్రా... లైసెన్స్‌లు లేకుండా కార్లు బైక్స్ డ్రైవింగ్. తాగి వొకచోట కూర్చోవచ్చుగా. ఆ బళ్ళు నడపకపోతే యేం..." మందలింపుగా అన్నారు కళ్యాణి.

"మమ్మీ... నువ్వంటే వోల్డ్... యీ మాళవికకి యీ ఛాదస్తం యెక్కడ నుంచి వచ్చింది... నువ్వూ యిలాగే వుండేదానివా," టీజింగ్‌గా అడిగాడు విష్ణు.

చిన్నచిన్న రోడ్లన్నీ దాటుకుంటూ రోజువారీ పనుల నుంచి కాస్తకాస్త సమయాన్ని చేజిక్కించుకొని ఆ మున్సిపల్ ఆఫీసు చుట్టూ కళ్యాణి, మాళవిక తిరగ్గాతిరగ్గా, "సరే... మేం యిన్స్‌పెక్షన్‌కొస్తాం," అన్నారు వాళ్ళు.

మాళవిక వుదయం పూట అటెళ్ళినప్పుడు, "వాళ్ళొచ్చారా..." అని అడగడం, "వాళ్ళెక్కడొస్తారమ్మా" అని విసుగ్గానో, నిరాశగానో, నిష్టూరంగానో రోజుకొక భావంతో సమాధానం చెప్పేది కుమారి.

చివరికి వొరోజు కుమారి, "వాళ్ళొచ్చారమ్మా," అంది.

"వాళ్ళొచ్చారా," మెరుస్తున్న కళ్ళతో అంది మాళవిక.

"అఁ... అందులో వొకటి డ్రైనేజ్‌దట. రెండు వాటర్‌వర్క్స్‌వట. డ్రైనేజి వాళ్ళు

కొలతలు తీస్కొని వెళ్ళారు. మిగిలిన రెండిటి గురించి వాటర్‌వర్క్స్ వాళ్ళకు చెప్పాలట...'' అంది కుమారి.

మాళవిక కళ్ళల్లో మళ్ళీ నిరాశ. తిరిగి వాటర్‌వర్క్స్ వాళ్ళ చుట్టూ తిరగడమంటే యెంత పనో అనుకుంటూ, ''సరే... వాళ్ళ దగ్గరికీ వెళ్తాలే,'' అంది.

'బిల్లులు కట్టకపోతే ఠంచనుగా ఆయా కనెక్షన్లు పీకేసే అన్ని డిపార్ట్‌మెంట్ల వాళ్ళూ యేదైనా సమస్య వస్తే మాత్రం వెంటనే రారెందుకో... ప్రతి డిపార్ట్‌మెంట్లో బాగు చేయటానికి యెక్కువమంది స్టాఫ్ లేరా, యేదైనా ప్రమాదం జరిగితే డిపార్ట్‌మెంట్ పెద్దలు, మంత్రులు సిటీలో వున్న ప్రతి పెద్దోళ్ళు వచ్చేస్తారేమో... మరి. కళ్ళ ముందు కనబడుతున్న ప్రమాదాన్ని తెలిసి యెందుకు పట్టించుకోరు. మన చేతుల్లో లేనివి సరే... వున్న వాటి పట్ల యెందుకిలా వుంటారు...' అనుకుంటూ యింటికి చేరి తల్లికి విషయం చెప్పింది.

''మీ యిద్దరికేం పనిలేదు,'' నవ్వుతూ అన్నాడు విష్ణు.

''వొరేయ్ యీసారి నువ్వెళ్ళరా ఆ డిపార్ట్‌మెంట్‌కి. నీకూ నీ ఫ్రెండ్స్‌కి యేం పనుంది. యెప్పుడూ మల్టీప్లెక్స్ దగ్గరే వేలాడుతూ వుంటారుగా,'' అంది మాళవిక.

''యేం చేస్తాం... నీకు లైఫ్‌ని యెంజాయ్ చేయటం రాదు. యెప్పుడూ యేదో వొక ప్రాబ్లమ్ వెతుకుతూ వుంటావ్. నేనెక్కడికీ వెళ్లను,'' అన్నాడు విష్ణు.

''నేను టైం చూస్కొని వెళ్తాలేమ్మా,'' అన్నారు శ్రీధర్.

''నాన్నగారండీ అప్లికేషన్ రాసివ్వనా...'' వుత్సాహంగా అడిగింది మాళవిక.

''షూర్ మై డియర్,'' అన్నారాయన.

వీలు చూస్కొని ఆ అప్లికేషన్ ఆయన రెండు రోజుల తర్వాత వాటర్‌వర్క్స్‌లో యివ్వడానికి బయలుదేరారు. గంటసేపు ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. ప్రతి యింటా కంప్యూటర్, ప్రతి వాళ్ళకి పర్సనల్ ఐడి. పర్సనల్ సెల్‌ఫోన్ వచ్చాక కూడా యిలాంటి పనులన్నీ యింతింత ఆలస్యమవటం ఆయనకి కాస్త విచారమేసింది.

మూడు రోజులైనా వాళ్ళెవరూ రాలేదు. మళ్ళీ యెవర్నో పంపిస్తే, 'చాలా పనుంది. మనుషుల్లేరు. వస్తున్నాం,' లాంటి జవాబులు. మరో రెండుసార్లు ఫాలోఅప్

చేశాక ఆయనకి పూర్తిగా నీరసమొచ్చేసింది.

'నావల్ల కాదురా,' అనేసారాయన.

క్లాస్‌ల మధ్యలో వీలు చూస్కొని వాళ్ళ డిపార్ట్‌మెంట్‌కి మాళవిక వెళ్ళింది. చివరికి యెలాగైతేనేం వాళ్ళొచ్చారు. చూశారు. వెళ్ళారు. ఆ తర్వాత నుంచి నాలుగైదుసార్లు అడిగినా, 'ఆర్డరిచ్చాం రావాలి,' అంటారు తప్పా, ఆ కన్నాల మీద మూతలు మాత్రం రాలా.

అలా చెప్పుకుంటూ వెళ్తున్న మిళింద్ మాటలకి అడ్డొస్తూ, "యిదంతా సరేగానీ... అసలిందులో మీ యిద్దరూ గొడవపడే విషయమేముందిరా," అడిగాడు శ్రీకర్.

"యివ్వన్నీ నీకెందుకు... నీకూ మీ యింట్లో వాళ్ళకీ పనేం లేనట్టుంది అని నవ్వుతూ అన్నాన్రా... అంతే మాళవికకి కోపమొచ్చేసింది. 'నేను చేసే పని పట్ల, ఆలోచనల పట్ల రెస్పెక్ట్ లేని నీతో స్నేహమేంటి' అందిరా..." అన్నాడు మిళింద్.

శ్రీకర్ మరో కోక్ తెచ్చుకొని తాగుతూ, "యిప్పుడు తన ఆలోచనల పట్ల నీకు రెస్పెక్ట్ వుందని చెప్పాలి. అంతేకదా... చెప్పేయ్," సింపుల్‌గా చెప్పేసాడు.

"యేంటి చెప్పేది. ఫోన్ తీయటంలా. మెసేజ్ యిచ్చా... రిప్లై లేదు."

శ్రీకర్ కొంచెం ఆలోచించి, "వెరీ సింపుల్‌రా... మాటలు కాదు. యిప్పుడు కావాల్సింది చేతలు... ఆ మూతలేవో పట్టుకొచ్చి నువ్వే పెట్టెయ్‌రాదూ..." పిజ్జా పీస్ తీసుకుంటూ నిదానంగా చెప్పాడు.

శ్రీకర్ యేం చెప్తాడా అని ఆత్రంగా యెదురు చూస్తున్న మిళింద్ వొక్కసారిగా పులిక్కిపడి, "వాట్... నేనా," అన్నాడు.

'నువ్వే' అన్నట్లు నవ్వుతూ చూశాడు శ్రీకర్.

"అవెక్కడ దొరుకుతాయిరా..."

'రేయ్... మావా వాటి తయారీలో ఇండియా లార్జెస్ట్ కంట్రీ తెల్సా... యెక్కడైనా దొరుకుతాయ్. మాళవిక కావాలంటే... వెతకాల్సిందే," అన్నాడు శ్రీకర్.

మిళింద్ కొంచెంసేపు ఆలోచించి, 'మాళవికని మాటల్లో యింప్రెస్ చేయడం కష్టంగా వుంది. యీ ఐడియా యేదో బావున్నట్టుందే,' అనుకొని, "సరేరా... అవెక్కడ దొరుకుతాయో తెలుసుకోరా వెళ్దాం," అన్నాడు.

"వొరేయ్... నేనా," భయపడుతున్నట్టు అన్నాడు శ్రీకర్.

"ప్లీజ్... రా..."

"వో.కె."

తరువాత రోజు శ్రీకర్ అవెక్కడ దొరుకుతాయో కనుక్కొనొచ్చాడు. యిద్దరూ కలిసి శ్రీకర్ వాళ్ళ కారు డ్రైవర్ని తీసుకొని అవి కొంటానికి బయలుదేరారు. అంతకుముందే ఆ మ్యాన్‌హోల్ కొలతలు తీస్కొచ్చిన పేపర్ వుందో లేదో అని తన వ్యాలెట్‌లో చెక్ చేస్కొని మరీ బయలుదేరాడు మిళింద్.

దాన్ని తయారుచేసేవాళ్ళకిచ్చి వాటిని తీసుకురమ్మని శ్రీకర్ వాళ్ళ కారు డ్రైవర్‌కి చెప్పి యిద్దరూ వెనక్కి వస్తుంటే శ్రీకర్ వున్నట్టుండి పగలబడి నవ్వాడు.

"యేంట్రా... యేమైంది..." అడిగాడు మిళింద్.

"ప్రేమ గట్టిపడాలంటే పువ్వులో, గ్రీటింగ్ కార్డ్సో, రింగ్‌టోన్సో, డైమండో యివ్వటం తెల్సు కాని యీ మ్యాన్‌హోల్ ప్రేమేంట్రా బాబూ. అసలు మ్యాన్ హోల్స్ గుండ్రం గానే యెందుకుంటాయ్‌రా..." అని మళ్ళీ విరగబడి నవ్వాడు.

మిళింద్ కూడా నవ్వుతూ, "అంతందంగా వుంటుంది కదా మాళు... అయినా అందమొక్కటే కాదురా తను ఆలోచించే యిలాంటి ఆలోచనలేవో నాకెక్కడో నచ్చుతున్నట్టున్నాయ్... అందుకే విసుగొచ్చి మాటలు జారినా మళ్ళీ తనకి నచ్చిన పని చేసేస్తుంటా," అన్నాడు మిళింద్.

"షి యీజ్ నైస్ రా... రేప్పొద్దున్నే లేచి తను వాకింగ్‌కి వెళ్ళే టైంకి మ్యాన్‌హోల్స్ వున్న సందులోకి వెళ్ళి మ్యాన్‌హోల్స్‌పై మూతల్ని చూసి హ్యాపీగా తను వాళ్ళనీ వీళ్ళనీ అవెప్పుడు పెట్టారని అడుగుతున్నప్పుడు మెల్లగా కనపడు. అచ్చం సినిమాలో హీరో కనపడినట్టు," అన్నాడు శ్రీకర్.

"గుడ్ ఐడియా... థాంక్స్‌రా," అన్నాడు మిళింద్.

తెల్లారేవరకు యీ విషయాన్ని మాళవికకి చెప్పకుండా ఆగటం తనవల్ల కాదేమో నని, అక్కడే వుంటే అమెకెక్కడ మెసేజ్ యిచ్చేస్తాననే భయంతో రాత్రి పన్నెండు వరకు శ్రీకర్‌ని వెంటపెట్టుకునే వున్నాడు మిళింద్.

తెల్లారి మొబైల్‌లో అలారం పెట్టుకొని మ్యాన్‌హోల్స్ వున్న సందు దగ్గరకెళ్ళి శ్రీకర్ చెప్పినట్టే పక్కన దాక్కున్నాడు.

అతనెళ్ళేటప్పటికి మాళవిక, కుమారి మరో ముగ్గురు మగవాళ్ళతో కలిసి మ్యాన్ హోల్ వుంచిన కంపని తీసేసిన వాళ్ళని తిట్టుకుంటూ తిరిగి కంప పెడుతున్నారు. ఆ దృశ్యం చూసి మిళింద్ అయోమయంగా చప్పున అక్కడికెళ్ళి, "అరెరె... వీటిపై మూతలేమయ్యాయ్," ఆశ్చర్యంగా అన్నాడు.

అనుకోకుండా కనిపించిన అతన్ని చూసి చిన్నగా నవ్వబోయి తనూ అతనూ మాటాడుకోవట్లేదని గుర్తొచ్చి ఠపీమని నవ్వాపేసింది మాళవిక. యేమెరగనట్టు ఆశ్చర్యపోతాడేంటని చికాకు కూడా వచ్చిందామెకు.

"మేం రాత్రి వీటి మీద మూతలేయించామే..."

"కల్లోనా," కోపంగా అంది మాళవిక.

"నీ మీదొట్టు మాళూ... నేనూ శ్రీకర్ వెళ్ళి వాళ్ళ డ్రైవర్ చేత తెప్పించి యిక్కడ వేయించాం," అన్నాడు మిళింద్.

అతని కళ్ళల్లో కనిపిస్తున్న నిజాయితీని చూస్తే నిజమే చెప్తున్నట్టనిపించింది మాళవికకి.

"మరేమైనాయ్," ఆశ్చర్యంగా అడిగింది.

"యెవరైనా యెత్తుకుపోయారేమో..." అంది కుమారి.

"వీటినెవరెత్తుకుపోతారు," ఆశ్చర్యపోయింది మాళవిక.

"మెటల్ అమ్ముకుంటే డబ్బులొస్తాయని వీటి నెత్తుకుపోతుంటారమ్మా..." అన్నాడు వాచ్‌మెన్.

"మరిప్పుడెలా?" అంది మాళవిక.

"మాళూ... యిప్పుడు యివియెవరెత్తుకుపోయారోనని వెతకమని పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరక్కేం... టైమ్ వేస్ట్," అన్నాడు మిళింద్.

"నేనేం చేసినా నీకు టైమ్ వేస్టే," చిరుకోపంగా అంటూ ఆమె చకచకా ముందుకు నడిచింది.

'బాప్‌రే... మళ్ళీ నోరు జారాను. మళ్ళీ మాళవికని యిప్పుడు మామూలుగా చేయటాన్కి పోలీసుల చుట్టూ తిరగాలా... ఆ చిన్న దొంగల్ని పట్టుకోవాలా...

లేదా మళ్ళీ కొత్తవి తెచ్చి వెయ్యాలా,' అని మిళింద్ ఆలోచిస్తుంటే మెసేజ్ అలెర్ట్ వినిపించింది. చూసాడు. మాళవిక నుంచి. యేముందోనని భయంతో మెసేజ్ వోపెన్ చేసాడు.

'థాంక్‌యూ... యెవ్వరూ యెత్తుకుపోనివి తీసుకొచ్చి వేయలేవా,' చదువుతోంటే అతని పెదవులపై చిర్నవ్వు.

'నిన్నెవ్వరూ నా నుంచి యెత్తుకుపోకుండా వుండాలంటే నువ్వనుకునే మంచి పని చేయాల్సిందే...' యీ మాటలు పైకి అనటం కూడా ప్రమాదమే... యెవ్వరైనా యెత్తుకుపోయేటట్టు కనిపిస్తున్నానా అంటుంది... అనుకుంటూ మిళింద్ శ్రీకర్‌కి ఫోన్ చేసి విషయం చెప్పాడు.

"వో... షిట్... లాభం లేదురా... తనకి నువ్వు పనికిరావ్... మీ బర్త్‌సైన్స్ కలిసేట్టు లేవ్... యెవరైనా సోషల్ రెస్పాన్స్‌బులిటీ డైరెక్టరో..." అతని మాటల్ని మధ్యలోనే కట్ చేస్తూ, "షటప్... మీ డ్రైవర్ని పంపించి అవి తెప్పించు. యీవినింగ్ టచ్‌కి వచ్చేయ్... నా క్రెడిట్ కార్డ్ మీద నీకు పార్టీ... బై," అన్నాడు.


వొక క్షణం ఆలోచించి, 'రేపు వుదయం మ్యాన్‌హోల్స్ దగ్గరే కలుద్దాం... మనకి కాఫీడే, పబ్స్, మల్టీప్లెక్స్‌లు అచ్చొచ్చినట్టు లేవ్ మై డియర్ వోల్డ్ లేడీ,' అని మాళవికకి మెసేజ్ ఇచ్చాడు.

'వోల్డ్ లేడీ' అనేసానే. మాళవిక యేమంటుందోనని భయంభయంగా మాన్‌హోల్స్‌ని చూస్తూ మిళింద్ బైక్ స్టార్ట్ చేస్తుంటే మెసేజ్ అలర్ట్ మోగింది.

తీసి చూసాడు. 'థాంక్ యూ మై డియర్ యంగ్ హార్ట్... నీ వోల్డ్ లేడీ.'

అతని కళ్ళల్లో రిలీఫ్.

'సో యిప్పటికి తగాదా గట్టెక్కినట్టే... యింకా ముందుముందు యిలాంటివి యెన్ని చూడాలో... యిప్పటికి ముందీ మ్యాన్‌హోల్ విషయం చూడాలి,' అనుకున్నాడు మిళింద్.



ఆదివారం ఆంధ్రజ్యోతి
3 డిసెంబర్ 2006